క్లుప్తంగా

వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం

తుని రూరల్: వి.కొత్తూరులోని వేణుగోపాల స్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు దంపతులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. టీడీపీ నాయకులు యనమల కృష్ణుడు, పోల్నాటి శేషగిరిరావు, యినుగంటి సత్యనారాయణ, వెలమ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ స్వామివారికి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు



దివ్యాంగ చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు గురువారం ఫిజియోథెరపీ సేవలందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. వేసవిలో చిన్నారుల ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోజూ చేయించాల్సిన వ్యాయామాలపై తల్లి దండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ శ్రీనివాస్ పరిశీలించారు. ఐఈఆర్పీ రాంబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో సామాజిక తనిఖీ సభలు

కిర్లంపూడి: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2022–2023లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ గ్రామ సభలు ప్రారంభమయ్యాయి. మండలంలోని సింహాద్రిపురం, ముక్కొల్లు గ్రామాల్లో గురువారం డీఆర్పీ వెంటక రమణ ఆధ్వర్యంలోనూ, వేలంకలో డీఆర్పీ ఎం.రాజు ఆధ్వర్యంలో అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. వేలంకలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో పలు చోట్ల కూలీల మస్తర్లు, మొక్కల లెక్కల్లో తేడాలు గుర్తించినట్టు డీఆర్పీ రాజు తెలిపారు. ఈ నెల 20 వరకూ గ్రామాల్లో సామాజిక తనిఖీలు, గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఏపీఓ బి.చిరంజీవిరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిపై కేసు

తొండంగి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్సై ఎస్.రవికుమార్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గోర్సపాలెం గ్రామానికి చెందిన యనమల బాబూరావు (31) ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. డ్యూటీ ముగించుకుని ఈ నెల 14న మంగళవారం రాత్రి పెరుమాళ్లపురం వైపు నుంచి గోర్సపాలెం బైక్‌పై వస్తుండగా వాకదారిపేట వద్ద కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి ఆటోను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన బాబూరావును స్థానికులు, కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో కాకినాడ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీనిపై మృతుడి భార్య అమ్మాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రవికుమార్ వివరించారు.

ట్రాక్టర్‌పై తరలిస్తున్న గడ్డి దగ్ధం

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్‌పై తరలిస్తున్న గడ్డి దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే... తాళ్లూరు గ్రామానికి చెందిన బి.సోమరాజు ఐదు ఎకరాల పొలంలో గడ్డిని ట్రాక్టర్‌పై తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి మంటలు వ్యాపించాయి. గడ్డి పూర్తిగా దగ్ధమై ట్రాక్టర్ ట్రక్కుకు కూడా మంటలు వ్యాపించాయి. జగ్గంపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేసే ప్రయత్నం చేశారు. ఈ ప్రమాదంలో రూ.50 వేలు ఆస్తి నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

బాలుడి వైద్యానికి రూ.27 వేల అందజేత



బాలుడి వైద్యానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి సభ్యులు

గోకవరం: అరుదైన బోన్‌మేరో వ్యాధితో చైన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోకవరానికి చెందిన అక్షయ్‌రామ్ వైద్యానికి స్థానిక సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి సంఘ సభ్యులు రూ.27 వేలు ఆర్థిక సహాయం అందించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై చలించిన సంఘం సభ్యులు నగదును సమకూర్చారు. ఈ మొత్తాన్ని గురువారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు, తూర్పుగోదావరి జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎస్ఎస్ ఆలీషాలకు అందజేశారు. తొలుత బాలుడి ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘం పాస్టర్ ఎస్ఆర్‌కే స్టీఫెన్, సభ్యులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణకు

చక్కటీ కార్యాచరణ

- పాడి రైతుకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- పశువులకు వద్దకే వెళ్లి టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది
- ఈ నెలాఖరు వరకూ కొనసాగనున్న కార్యక్రమం
- హర్షం వ్యక్తం చేస్తున్న పాడిరైతులు



కోటనందూరులో దూడకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి రత్నతేజ

కోటనందూరు: పాడి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇటీవల కాలంలో పశువులకు అనేక వ్యాధులు సోకుతున్న నేపథ్యంలో వాటి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి ప్రభావంతో పాలదిగుబడి తగ్గిపోవడంతో పాటు పశువులు మరణాలు సంభవించే అవకాశం ఉంది. దీంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు. పశువైద్య సిబ్బంది నేరుగా రైతుల వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి పాడి పశువులకు టీకాలు వేస్తున్నారు. మూగ జీవాలకు సంక్రమించే వ్యాధుల పట్ల పాడిరైతులు అప్రమత్తంగా ఉండి పశువైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని సూచిస్తున్నారు.

41033 పశువులకు టీకాలు

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో పశువులకు ఈ నెల 1 నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు. ఈ నెలాఖరు వరకూ కొనసాగే ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియలో భాగంగా 100 శాతం పశువులకు టీకాలు వేయనున్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. తుని సబ్‌డివిజన్ పరిధిలోని 8249 ఆవులు 32,784 గేదెలు వెరసి 41,033 పశువులు ఉన్నాయి. వీటిలో 4 నెలలు దాటిన ప్రతి పశువుకు టీకా వేయనున్నారు. పశువైద్య సిబ్బంది వచ్చిన సమయంలో అందుబాటులో లేని పశువులకు స్థానిక రైతుభరోసా కేంద్రం, మండల కేంద్రంలో ఉన్న పశువైద్యశాలలో టీకాలు వేస్తారు.

గాలికుంటు వ్యాధి లక్షణాలు, కలిగే నష్టాలు

గాలికుంటు వ్యాధి సోకితే పశువులకు తీవ్ర జ్వరంతో పాటు నీరసంగా కనిపిస్తాయి. కొద్దిపాటి ఎండకు కూడా పశువులు రొప్పుతాయి. మగ పశువుల్లో పని చేసే సామర్థ్యం తగ్గిపోతుంది. నోటి నుంచి తీగల మాదిగా సొంగ కారుతుంది. నోటి మధ్యలో, కాలు గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది. వ్యాధి సోకినతల్లి పాలు తాగిన దూడలు మృత్యువాత పడతాయి.

జగనన్న పాలవెల్లువతో రైతులకు మేలు

పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ పథకాన్ని ప్రవేశపెట్టింది. పాలకు కనీస గిట్టుబాటు ధర కల్పించి రైతు కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేలా చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా పశుసంవర్ధక శాఖ అధికారులు పల్లెల్లో పాడిరైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఎలాంటి పశువులు కొనుగోలు చేయాలి, పశువుల పెంపకం, సంరక్షణ, ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు.



పశువులకు వ్యాక్సినేషన్‌పై వెటర్నరీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏడీ శ్రీధర్

> **ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు**
>
> పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేస్తోంది. పశువైద్య సిబ్బంది నేరుగా రైతుల పశువులు పాకల వద్దకు టీకాలు వేస్తారు. ప్రణాళిక ప్రకారం సిబ్బంది గ్రామాల్లో పర్యటించి 4 నెలలు దాటిన ప్రతిపశువుకు టీకా వేస్తారు. రైతు భరోసా కేంద్రాలు, పశువైద్య శాలల్లో సైతం టీకా అందుబాటులో ఉంటుంది. పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలి.
>
> — వి.శ్రీధర్, ఏడీ, పశుసంవర్ధక శాఖ, తుని సబ్‌డివిజన్



డ్రోన్ సర్వే ప్రారంభం



లోవకొత్తూరులో డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రమణ

తుని రూరల్: జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకంలో చేపట్టిన సమగ్ర సర్వేతో భూ రికార్డులు, భూములకు శాశ్వత హక్కు పత్రాలు లభిస్తాయని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ అన్నారు. మండలంలోని లోవకొత్తూరులో డ్రోన్‌తో చేపట్టిన సమగ్ర సర్వేను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సర్వేతో గ్రామాల్లో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రైతులు సర్వేకు సహకరించాలని కోరారు. మండల సర్వేయర్ దేవుడు ఆధ్వర్యంలో సిబ్బంది భూములను సర్వే చేశారు. లోవకొత్తూరు, రాజుపేట సర్పంచులు లంక వెంకటలక్ష్మి, బుద్దాల సత్తిబాబు, ఎంపీటీసీలు కిల్లి సన్యాసిరావు, గింజాల సుబ్రహ్మణ్యేశ్వరీదేవి, నాయకులు లంక కృపానందం, సూరెడ్డి లోవరాజు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత



బాధిత కుటుంబానికి బీమా సొమ్ము అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: గ్రామానికి చెందిన కోర్పు సత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు మంజూరు కాగా ప్రస్తుతం దహన ఖర్చుల కోసం రూ.10 వేలు మంజూరయ్యాయి. ఈ నగదును గురువారం వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు తదితరులు బాధిత కుటుంబానికి అందజేశారు. మిగిలిన నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమవుతుందని ఆయన తెలిపారు. పార్టీ నాయకులు నరాలశెట్టి నర్శయ్య, పులపర్తి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

జీవన విధానమే సనాతనధర్మం

హిందూ మహాసభ జాతీయ కార్యదర్శి అతిథేశ్వరానంద పర్వత స్వామీజీ



జీయ్యన్న మఠం విశిష్టతను వివరిస్తున్న మఠాధిపతి ప్రసాదాచార్యులు

గండేపల్లి: ప్రజల జీవన విధానమే సనాతన ధర్మమని బీహార్‌లోని శ్రీయోగి పీఠం స్వామీజీ, హిందూ మహాసభ జాతీయ కార్యదర్శి అతిథేశ్వరానంద పర్వత స్వామీజీ అన్నారు. తాళ్లూరులోని జీయ్యన్న మఠాన్ని గురువారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖండ భారతావనిలో అన్ని అద్భుతాలే అన్నారు. ప్రపంచంలో సగం దేశాలు భారత సంస్కృతిని ఆదర్శంగా తీసుకుంటాయన్నారు. మన వైద్యం, యోగా, జ్యోతిష్యం, వాస్తు, రసాయన, భౌతిక, అర్థశాస్త్రాలు, క్షిపణుల గురించి వేదాల్లోనే రుషులు వివరించారన్నారు. సమాజంలో నీతి, నిజాయితీ, నిస్వార్థం కనుమరుగు అవ్వడంతోనే అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ దేశభక్తి, దైవ భక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. హైందవ ధర్మాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ నెల 10న తెలంగాణ రాష్ట్రంలోని యాదగిరి గుట్టలో ఆధ్యాత్మిక సభ నిర్వహించినట్టు తెలిపారు. ఏపీలోని ద్వారకా తిరుమల, సింహాచలం, విజయనగరంలో రామతీర్థాలు, అరసవల్లి, కోడూరులోని త్రివేణి సంఘం, ప్రకాశంలో సాయిబాబా, నెల్లూరులో ములగముడి వెంకయమ్మ తదితర చోట్ల భజన కళాకారులను సంప్రదించి వారి వివరాలను సేకరించినట్టు జానపద నృత్య కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షుడు పులిమామిడి యాదగిరి తిరుపతి, రాష్ట్ర నాయకుడు ఎం.నారాయణ తెలిపారు. అనంతరం శ్రీరామ నవమి శోభాయాత్ర పేరిట ఈ నెల 30 రాజమహేంద్రవరంలో నిర్వహించే బైక్ ర్యాలీ పోస్టర్‌ను స్వామీజీ ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, పాలచర్ల రమేష్ తదితరులు స్వామీజీని కలిసి ఆశీస్సులు పొందారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు

ఏలేశ్వరం: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు నియోజకవర్గవ్యాప్తంగా గురువారం ప్రశాంతంగా జరిగాయి. నియోజకవర్గంలో పరీక్షలకు 14 మంది విద్యార్థులు గైర్హజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 297 మందికి గాను 9 మంది, గురుకుల కళాశాలలో 303 మందికి గాను 5 మంది విద్యార్థులు గైర్హజరయ్యారు. గురుకుల కళాశాలలో పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా చంద్రశారద, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా పలివెల శివాజీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా ఎస్‌హెచ్ కుమారి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా కె.చినబుజ్జి వ్యవహరించారు. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ వి.సంధ్య, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశారద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

తుని: పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన ఏడు కేంద్రాల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని రాజా కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, శ్రీప్రకాష్, సిద్ధార్థ, వివేక, ఎస్వీ, వైష్ణవి కళాశాల సెంటర్లలో విద్యార్థులు తెలుగు, సంస్కృతం పరీక్షలు రాసినట్టు కస్టోడియన్ రమేష్ తెలిపారు. ఏడు సెంటర్లల్లో పరీక్షలకు 2023 మందిని కేటాయించగా 2031 మంది పరీక్షకు హాజరు కాగా 36 మంది గైర్హాజరు అయ్యారన్నారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

కిర్లంపూడి: మండలంలో ఇంటర్ సెంకడియర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 405 విద్యార్థులకు గాను 399 మంది, జగపతినగరం ప్రగతి జూనియర్ కళాశాలలో 247 విద్యార్థులకు గాను 242 పరీక్షలకు హాజరు కాగా 11 మంది గైర్హాజరైనట్టు డీఓ వర్ధనపు శివప్రసాద్ తెలిపారు.

వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు వాయిదా

అక్రమాలపై విచారణ చేపట్టాలని పాలకవర్గం డిమాండ్

గోకవరం: మండలంలోని తంటికొండ వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీల ఆదాయం లెక్కింపు వాయిదా పడింది. ఆలయంలో అక్రమాలపై విచారణ చేపట్టకుండా హుండీ ఆదాయం లెక్కించ వద్దని పాలకవర్గం సభ్యులు పట్టుబట్టారు. వివరాల్లోకి వెళితే.. దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కింపునకు గురువారం అధికారులు ఏర్పాట్లు చేశారు. కాకినాడ దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో హుండీల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తుండగా దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), ఇతర పాలకవర్గం సభ్యులు అడ్డుకున్నారు. ఆలయంలో పలు అక్రమాలు జరిగాయని, వీటిపై విచారణ నిర్వహించకుండా హుండీ ఆదాయం ఏ విధంగా లెక్కిస్తారని ప్రశ్నించారు. విచారణకు, హుండీ లెక్కింపునకు ఎటువంటి సంబంధం లేదని అధికారులు తెలిపినప్పటికీ పాలకవర్గం ససేమేరా అనడంతో ఉద్రిక్తత నెలకొంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా ఎస్సై యూవీ శివనాగబాబు సిబ్బందితో ఆలయం వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విషయం తెలుసుకున్న మండలం సచివాలయ కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్ ఆలయం వద్దకు చేరుకుని అధికారులు, పాలకవర్గం సభ్యులతో మాట్లాడారు. మధ్యాహ్నం వరకు చర్చలు జరిగాయి. దీంతో హుండీ ఆదాయం లెక్కింపునకు, ఆ సొమ్మును బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు తగిన సమయం లేకపోవడంతో హుండీ ఆదాయం లెక్కింపును తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు దేవదాయశాఖ అధికారులు ప్రకటించారు. అనంతరం దేవస్థానంలో అక్రమాలపై విచారణ నిర్వహించాలని ఆయనకు పాలవకర్గం సభ్యులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈఓ ఆర్‌వీ చందన, తదితరులు పాల్గొన్నారు.



దేవదాయ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న పాలకవర్గ సభ్యులు

వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

తొండంగి: మండలంలోని దానవాయిపేటలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. దాతల సహకారంతో ఈ నెల 19 వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేదపండితులు అగ్నిహోత్రం రంగాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం స్వామివారికి పంచామృతాభిషేకాలు, 18న హోమాలు, స్వామి వారి కల్యాణం, అన్నసమారాధన, 19న గ్రామోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మంచి నాయకుడిని కోల్పోయాం

వరుపుల రాజా సంతాప సభలో టీడీపీ నాయకులు

ప్రత్తిపాడు: వరుపుల రాజా మృతితో మంచి నాయకుడిని కోల్పోయామని టీడీపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. డీసీసీబీ మాజీ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల రాజా సంతాప సభ ప్రత్తిపాడులోని టీడీపీ కార్యాలయం వద్ద గురువారం జరిగింది. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ, తన రాజకీయ జీవితంలో రాజా వంటి వ్యక్తిని చూడలేదన్నారు. ఆయన సతీమణి సత్యప్రభను శాసనసభకు పంపాల్సిన బాధ్యత నియోజకవర్గ టీడీపీ శ్రేణులపై ఉందని అన్నారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ, రాజా లాంటి యువ నేతను కోల్పోవడం దురదృష్టకరమన్నారు. టీడీపీ నేతలు చింతకాయల అయ్యన్నపాత్రుడు, చిక్కాల రామచంద్రరావు, జ్యోతుల నెహ్రూ, ఎస్‌వీఎస్ వర్మ, బండారు సత్యనారాయణమూర్తి, రెడ్డి సుబ్రహ్మణ్యం, వంగలపూడి అనిత తదితరులు వరుపుల రాజాతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రాజా సతీమణి సత్యప్రభను నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా నియమించడమే కాకుండా ఆమెకే టిక్కెట్ ఇవ్వాల్సిందిగా పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడిని కోరుతామని నాయకులు స్పష్టం చేశారు. దీనిపై చంద్రబాబు నుంచి త్వరలో అధికారిక ప్రకటన వెలువడుతుందని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. తొలుత వరుపుల రాజా చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కొద్దిసేపు మౌనం పాటించారు. ప్రత్తిపాడు ఫైర్ స్టేషన్ సమీపాన మెయిన్ రోడ్డుపై వరుపుల రాజా విగ్రహాన్ని యనమల తదితరులు ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మాజీ ఎమ్మెల్యేలు వరుపుల సుబ్బారావు, దాట్ల బుచ్చిబాబు, నాయకులు జీఎస్ఎన్ మూర్తి, మీసాల రాజు, జ్యోతుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.



వరుపుల రాజా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

స్ఫూర్తిప్రదాత అమరజీవి

- ఘనంగా పొట్టిశ్రీరాములు జయంతి
- ఆయన త్యాగాలను కొనియాడిన నేతలు

ఏలేశ్వరం: ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు పొట్టిశ్రీరాములు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి వైఎస్సార్ సీపీ నేత అలమండ చలమయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. నేటి యువత పొట్టిశ్రీరాములును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మున్సిపల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, శిడగం వెంకటేశ్వరరావు, వాగు బలరామ్, తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సూర్యనారాయణ పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తుని రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఓ శేషగిరిరావు, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, చిటికెల వరహాలబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గోకవరం: అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని స్థానిక శ్రీవాసవీ ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఆవరణలోని పొట్టిశ్రీరాములు, గాంధీ విగ్రహాలకు సంఘం అధ్యక్షుడు బత్తుల నానాజీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరూ పొట్టిశ్రీరాములు త్యాగాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

ప్రత్తిపాడు: స్థానిక తోటవీధిలోని పుస్తక నిక్షిప్త కేంద్రం (బీడీసీ)లో గురువారం పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. పెద్దాపురం గ్రేడ్ 1 లైబ్రేరియన్ పాలంకి నాగరాజు ఆధ్వర్యాన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, మాజీ గ్రంధాలయాధికారులు చిలకమర్తి సాయి ప్రసాద్, గొంచాల మహేశ్వరరావు పాల్గొన్నారు.

కోటనందూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో పొట్టిశ్రీరాములు విగ్రహానికి పీఎంసీ చైర్మన్ ఉల్లూరి శ్రీను, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలను విద్యార్థులకు వివరించారు.

జగ్గంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఉత్తరాంధ్ర జిల్లాల బీసీ అధికార ప్రతినిధి గోరింత అప్పలరాజు పూలమాల వేసి నివాళులర్పించారు.



ఏలేశ్వరంలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
